

నర్సులను గౌరవించండి

మానవ సంబంధాలు మంట కలిసాయనడానికి కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యా ఘటన నిదర్శనం. ఆ ఘటన దేశం మొత్తాన్ని ఆలోచింపజేస్తుంది. క్షేత్ర స్థాయిలో నర్సులపై చిన్న చూపు ఉంది. ఇది ఏ మాత్రమూ సరైంది కాదు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చేసిన కృషిని గౌరవించండి.

– జి.బంగారుపాప, స్టాఫ్‌నర్సు, అంగర పీహెచ్‌సీ, కపిలేశ్వరపురం





పనిచేసే పరిస్థితులు కల్పించాలి

ప్రజలు ఆరోగ్యం కోసం నిరంతరం పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది పని ప్రదేశంలో ధైర్యంగా పనిచేసే పరిస్థితులు కల్పించాలి. కోల్‌కతా సంఘటన నేపథ్యంలో ఆడపిల్లలం వేరే ఊరికి వెళ్లి పనిచేస్తుంటే ఇంటి వద్ద తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతుంటారు. అందరూ ఉండరు కానీ ఆసుపత్రికి వచ్చేవారిలో కొందరు మద్యం తాగి వచ్చే వాళ్లు కూడా ఉంటారు. అటువంటి వారితో కొన్నిసార్లు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. దీనికి పరిష్కారంగా ఏరియా ఆసుపత్రిలో ఉండే విధంగా పీహెచ్‌సీల వద్ద కూడా సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

డాక్టర్ అలేఖ్య, వెల్ల పీహెచ్‌సీ, రామచంద్రపురం మండలం

సీజనల్ డేంజర్

- విజృంభిస్తున్న దోమలు
- పెరుగుతున్న జ్వరపీడితులు
- 'ఫీవర్' సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది
- పరిశుభ్రతపై అవగాహన

రాయవరం: వర్షాకాలం కావడంతో దోమల విజృంభణ పెరిగింది. అపరిశుభ్ర వాతావరణంతో దోమల వ్యాప్తి మరింత వేగంగా జరుగుతోంది. అవి కుట్టడంతో ప్రజల వ్యాధులు బారిన పడుతున్నారు. గ్రామాల్లో మురుగునీరు పారకపోవడం, నీటి నిల్వలు పెరిగి దోమలు వ్యాప్తి చెందడంతో వైరల్ ఫీవర్లు, డెంగీ, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఇప్పటికే మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతుందని వైద్యులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం పల్లెల్లో ఎక్కడ చూసినా జ్వరపీడితులు అధికంగానే ఉంటున్నారు. ప్రతి పీహెచ్‌సీలో రోజుకు 10 మంది వరకు జ్వరపీడితులు నమోదవుతున్నారు. అలాగే డెంగీ కేసులు కూడా పెరుగుతున్నాయి.

రోగాల వ్యాప్తికి అనుకూలం

వర్షాల కారణంగా ఇళ్లలో నీటి వినియోగం తక్కువగానే ఉంటుంది. అయితే పరిసరాల్లో నీటి నిల్వలు ఉండడం, మురుగునీరు పారే అవకాశం లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. లార్వా వృద్ధి చెందడంతో దోమల ప్రభావం బాగా పెరుగుతుంది. పూల కుండీలు, శిథిల భవనాలు, ఖాళీగా ఉన్న ఆవాస ప్రాంతాలు, వాడని టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాల్లో ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. తాగునీటి పైపులైన్ లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది.

ఇంటింటా 'ఫీవర్' సర్వే

ప్రస్తుతం వైరల్ ఫీవర్లు రోజురోజుకు పెరుగుతుండడంతో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపడుతున్నారు. రెండు వారాల నుంచి ఈ సర్వే చేపడుతున్నారు. సర్వేలో గుర్తించిన కేసులను సమీప ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలకు వైద్య సిబ్బంది సిఫార్సు చేస్తున్నారు. జ్వర తీవ్రతను బట్టి వైద్యులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఇటీవల ప్రతి రోజు 10 నుంచి 15 మంది జ్వర పీడితులు ఆస్పత్రికి వస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి రాని వారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ద్వారా కూడా వైద్యులు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, పరీక్షలు చేపడుతున్నారు.

క్లస్టర్ పరిధిలో ఇలా

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. మండపేట, రామచంద్రపురం పట్టణాల్లో ఏరియా ఆస్పత్రులున్నాయి. రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో అర్బన్ ఆస్పత్రులతో పాటుగా, డి.కేశవరం, ద్వారపూడి, కపిలేశ్వరపురం మండలంలో అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీలు ఉండగా, కపిలేశ్వరపురంలో కమ్యూనిటీ ఆస్పత్రి ఉంది. రాయవరం మండలంలో రాయవరం, మాచవరంలో పీహెచ్‌సీలు, కె.గంగవరం మండలంలో దంగేరు, పేకేరు, పామర్రు, కుందూరు, శేరిలంకలో పీహెచ్‌సీలున్నాయి. కాజులూరు మండలంలో దుగ్గుదూరు, రామచంద్రపురం మండలంలో వెల్ల, ద్రాక్షారామలో పీహెచ్‌సీలున్నాయి. ఈ పీహెచ్‌సీల పరిధిలో ఇటీవల కాలంలో ప్రతి రోజు జ్వరాల బాధితులు వైద్య సేవలకు వస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీలో రోజుకు 10–15 కేసులు నమోదవుతున్నాయి. గ్రామాల్లో అపారిశుధ్య పరిస్థితులు దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



పసలపూడిలో ప్రధాన రహదారి పక్కన నివాసాలకు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు



రాయవరం మండలం బత్తులవారి సావరంలో జ్వర పీడితులను ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

ప్రత్యేక వైద్య శిబిరం

రాయవరం మండలం చెల్లూరు శివారు బత్తులవారి సావరంలో జ్వరపీడితులు అధికంగా ఉండడంతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో నిర్వహించిన సర్వేలో 12 జ్వరపీడిత కేసులు నమోదు కాగా, నలుగురు డెంగీ అనుమానితులుగా గుర్తించారు. వీరిలో ఇరువురికి ప్లేట్‌లెట్స్ తగ్గడంతో 108 వాహనం ద్వారా రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇరువురు గ్రామంలోనే వైద్య సేవలు పొందుతున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శ్రీనివాస్ తెలిపారు.



రాయవరం పీహెచ్‌సీలో జ్వరంతో బాధపడుతున్న వైద్య సేవలు పొందుతున్న వైనం

ఇంటి వైద్యం వద్దు

జ్వరం ఉన్న ప్రతి ఒక్కరూ సమీపంలో ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. జ్వరం తగ్గిపోతుందని అని మాత్రం అనుకోకుండా, పరీక్షలు చేయించుకున్న తర్వాత జ్వర తీవ్రతను బట్టి వైద్యం పొందాల్సి ఉంటుంది. ఒక్కోసారి డెంగీ వంటి జ్వరాలు వచ్చినప్పుడు ప్రాణాంతకమవుతుంది. అందుకే ముందుగా ప్రతి ఒక్కరూ ముందుగానే మేల్కొనాలి.

– డాక్టర్ రమ్యశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

వైరల్ కేసులు అధికం

ఏరియా ఆస్పత్రికి వచ్చే కేసుల్లో అధికంగా వైరల్ ఫీవర్లు ఉన్నాయి. జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎలీషా పరీక్ష ద్వారా మాత్రమే డెంగీ నిర్ధారణావుతోంది. ఆస్పత్రికి వచ్చే వారికి అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. జ్వరాలను నిర్లక్ష్యంగా తీసుకోరాదు.

– డాక్టర్ ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రామచంద్రపురం

క్లుప్తంగా

పీఠంలో హైకోర్టు అదనపు జడ్జి పూజలు



పీఠంలో కుటుంబ సమేతంగా పూజలు చేస్తున్న హైకోర్టు అదనపు జడ్జి సుమతి

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని హైకోర్టు అదనపు జడ్జి జగడం సుమతి శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా పీఠాన్ని సందర్శించిన జడ్జి సుమతి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు జడ్జి సుమతికి వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆమె పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. వారి వెంట అనపర్తి జేఎఫ్‌సీఎం ఎం .వంశీకృష్ణ ఉన్నారు.

నేత్రదానం



మరణానంతరం నేత్రదానం చేసిన పట్టాభి (ఫైల్)

మండపేట: విద్యా వికాస్ విద్యాసంస్థల చైర్మన్ వర్రే పట్టాభి రామన్న (87) పట్టణంలో శనివారం కన్నుమూశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. తన తండ్రి ఆశయాల మేరకు కుమారుడు విశ్రాంత ఉపాధ్యాయుడు వర్రే సత్యనారాయణ తండ్రి నేత్రాలను దానం చేశారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు తెలియజేయడంతో ప్రత్యేక వాహనంలో వైద్యులు, సిబ్బంది మండపేట వచ్చి పట్టాభి పార్థివదేహాన్ని సందర్శించి, అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో రెండు నేత్రాలను సేకరించారు. కాగా పట్టాభి మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ దుర్గారాణి సంతాపం ప్రకటించారు. కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా, కాపు నాయకులు వుంగరాల రాంబాబు, యాళ్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, మెండు బాపిరాజు తదితరులు తమ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆర్టీసీ స్థలం లీజుకు దరఖాస్తు చేసుకోండి

రామచంద్రపురం రూరల్: మండపేట ఏడిద రోడ్డులోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో 3640 చదరపు గజాల ఖాళీ స్థలం 15 సంవత్సరాల కాలపరిమితికిగాను అద్దె ప్రాతిపదికన లీజుకు ఇవ్వడానికి టెండరు పిలిచినట్లు రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారాలు ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీఎస్‌ఆర్టీసీ.ఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడానికి సెప్టెంబరు 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమయం ఉందన్నారు. పూర్తి చేసిన టెండరు ఫారాలను 13వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపుగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నందు ఉన్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్–2 కార్యాలయం నందు ఏర్పాటు చేయబడిన టెండరు బాక్స్ నందు వేయాల్సిందిగా తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరవడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల ఔత్సాహిక వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు.

విద్యాభివృద్ధితోనే సమాజ పురోగతి



కుయ్యేరులో విద్యార్థికి ఆర్థిక సహకారం అందజేస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు: విద్యాభివృద్ధితోనే సమాజం పురోగతి చెందుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం మండలంలోని కుయ్యేరులో మంత్రి సుభాష్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ అనే బాలుడు కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో స్కూలు ఫీజు కట్టలేక సతమతమౌతున్నాడని కార్యకర్తలు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే ఆయన స్పందిస్తూ శ్రీమన్నారాయణను పిలిపించి రూ.ఐదువేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పార్టీ నాయకులు డి.శ్రీధర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

యువకుడి గల్లంతు

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన ముత్యాల శ్రీను (40) శుక్రవారం రాత్రి బహిర్భూమికి వెళ్లి కాలువలో గల్లంతయ్యాడు. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక–ముక్తేశ్వరం ప్రధాన కాలువలో కాలు జారి గల్లంతయ్యాడు. దీంతో బంధువులు ముత్యాల శ్రీను ఆచూకీ కోసం జాలర్ల సాయంతో ముక్తేశ్వరం పంట కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు.

జగనన్న ఆశయ సాధనకు కార్యకర్తల కృషి



సూర్యప్రకాశ్ పుట్టినరోజు సందర్భంగా తిప్పరాజుపాలెంలో చిన్నారులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేస్తున్న కార్యకర్తలు

కాజులూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా కార్యకర్తలు ఎల్లప్పుడూ కృషి చేస్తామని మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పెంకే వెంకటరమణ అన్నారు. శనివారం మండలంలోని తిప్పరాజుపాలెం, అంచమ్మచెరువు, తర్లంపూడి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 150 మంది చిన్నారులకు ఎన్నారై పోలినాటి శ్రీనివాసు ఆర్థిక సహకారంతో పార్టీ కార్యకర్తలు పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, పలకలు తదితర సామగ్రి, స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. 25వ తేది నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ పుట్టినరోజు పురస్కరించుకుని ఆదివారం పాఠశాలలకు సెలవు కావడంతో ముందస్తుగా పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యకర్తలు ఎల్లప్పుడూ జగనన్న, సూర్యప్రకాశ్‌కు వెన్నంటి ఉంటూ వారి ఆశయసాధన కోసం పని చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఆర్.త్రిమూర్తులు, ఉంగరాల శివ, నరాల తిరుపతిరావు, గంటి ఇజ్రాయేలు, కంచి వెంకటేశ్వరరావు, కాశి శ్రీనివాసరావు, మణికంఠచ రాంబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ బస్సులు ద్రాక్షారామ మీదుగా నడపాలి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో 5 మంది తమ సమస్యలను తెలియజేసినట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. రామచంద్రపురం మండలం ద్రాక్షారామకు చెందిన చెరుకు బాబూరావు కాకినాడ డిపో నుంచి విజయవాడ వెళ్లే బస్సులు కొన్నింటిని ద్రాక్షారామ మీదుగా నడపాల్సిందిగా కోరారు. అదే విధంగా రాజమహేంద్రవరం వెళ్లేందుకు కోటిపల్లి నుంచి నడిపే బస్సులు రాత్రి 9.30 గంటల నుంచి 9.45 గంటల సమయంలో ఉండే విధంగా చూడాలని కోరారు. కాకినాడ డిపో మేనేజర్ దృష్టికి తీసుకుని వెళతామని డిపో మేనేజర్ సమాధానం తెలిపారు. రాయవరం మండలం పసలపూడికి చెందిన కేఎస్ నారాయణరావు బస్ రూట్ వైడ్ డెస్టినేషన్ బోర్డుల్లో లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాజమహేంద్రవరం లాస్ట్ బస్ రాత్రి 9.30 గంటలకు ఉండాలని కోరారు. ఎక్కే, దిగే స్టేజీల వద్ద కండక్టర్ రూట్ వివరాలతో బిగ్గరగా చెప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పై అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. గొల్లలమామిడాడకు చెందిన వి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ గొల్లలమామిడాడ నుంచి పెదపూడి, పెద్దాడ, దోమాడ, కరకుదురుల మీదుగా కాకినాడకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఉన్నతాధికారులకు తెలియజేసి నిర్ణయం తీసుకుంటామని డీఎం తెలిపారు. మండపేటకు చెందిన చెల్లా సత్యనారాయణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం బస్సులు రామచంద్రపురం నుంచి మండపేటలో ఏడిద రోడ్డులోని బస్టాండ్ మీదుగా కలువపువ్వు సెంటర్ మీదుగా నడపాలని కోరారు. చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన ప్రతాప్ మాట్లాడుతూ సామర్లకోట నుంచి రామచంద్రపురం పట్టణానికి చివరి బస్సు రాత్రి 9.30 గంటలకు ఉండేలా చూడాలని కోరారు. సర్వీసును బట్టి మార్పు చేస్తామని డీఎం తెలిపారు.



డయల్ డీఎం కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

ఆదర్శలో అనాథలకు అన్నదానం



ఆదర్శలో అన్నదానం చేస్తున్న పార్టీ నాయకులు

మండపేట: మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పుట్టిన రోజును పురస్కరించుకొని శనివారం పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ఆమె అభిమానులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు), రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు ఆమె పుష్పగుచ్ఛాలు అందించి శుభాశీస్సులు అందించారు. శనివారం ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అన్నదానం నిర్వహించింది.ఈ కార్యక్రమం 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. గుమ్మిలేరు రోడ్డులోని ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు.

అక్కడే కాకుండా పేదలకు సాయం అందించారు. కేపీ రోడ్డులో చైర్‌పర్సన్ భర్త పతివాడ రమణ, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు భారీ కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, మడికి ఆనందరావు, మందపల్లి సుధాకర్, గనిపే నాగభూషణం, లంక జాన్, పెనుముచ్చి బాబూసుకుమార్, కొమ్ము రాంబాబు, పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు పౌష్టికాహారాన్ని రుచిగా అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ-2 మోకా ప్రకాష్‌తో కలసి శనివారం పరిశీలించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వంట చేసే ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించి తాగునీరు విషయంలో జాగ్రత్త లు పాటించాలన్నారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించి నాణ్యత, రుచిపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి భవన నిర్మాణ పనులను హెచ్ఎం కడలి సాయిరామ్‌ను అడిగి తెలుసుకున్నారు.

స్పందించారు.. బాగు చేశారు..

కె.గంగవరం: పంట బోదెల్లో గుర్రపుడెక్క, చెత్తమొక్కలు ఉండడం వల్ల సాగునీరు అందదు.. సాగు సాగదు అనే శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించారు. శివల నుంచి కుడుపూరు, దంగేరు, శివారు గ్రామాలకు వెళ్లే పంట బోదెలను కూలీల సహాయంతో పూడికతీసి గుర్రపుడెక్కను తొలగించి, గట్టుకు ఇరువైపులా ఉన్న చెత్త మొక్కల గడ్డిని తొలగించి బోదెలను బాగు చేశారు. ఇరిగేషన్ ఏఈ సుజాత మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి బోదెలను శుభ్రం చేసే పనిలో ఉన్నామని ప్రతి ఎకరానికి పుష్కలంగా సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు అధైర్యపడొద్దని సాగునీరు పూర్తి స్థాయిలో అందిస్తామని ఆమె చెప్పారు. బోదెలను బాగు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేసి 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఇంపాక్ట్



శివలలో పంటబోదెలు బాగు చేస్తున్న కూలీలు

వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలపై విచారణ

కపిలేశ్వరపురం: నల్లూరు వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై అసిస్టెంట్ రిజిస్ట్రార్ వి.జవహర్ శనివారం విచారణ చేపట్టారు. సహకార సంఘం నిధులు పక్కదారి పట్టాయంటూ వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. సహకార సంఘంలోని రికార్డులు, తీర్మానాలు తదితర అంశాలపై విచారణ చేపట్టారు. జవహర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతులు సహకారంలోని సుమారు రూ.79 లక్షల డిపాజిట్ సొమ్ము పక్కదారి పట్టిందంటూ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును ఆశ్రయించారు. ఆయన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. కాగా తనను విచారణకు ఆదేశించారన్నారు. డిపాజిట్లు సేకరణ, రుణాలు, రికవరీ వ్యవహారాలపై విచారిస్తున్నామన్నారు. 2019లో సీఈవోగా సలుమూరి శ్రీనివాస్ పనిచేసేవారని, ఆయన హయాంలో కంటింజెన్సీ ఎంప్లాయిగా గుత్తుల నరేష్ ఉన్నారన్నారు. సీఈఓ శ్రీనివాస్ మరణించగా 2021 మార్చిలో నరేష్‌ను సీఈవోగా అప్పటి త్రిమెన్ కమిటీ తీసుకున్నారు. పలు ఆరోపణలు రావడంతో నరేష్‌ను సీఈఓ బాధ్యతల నుంచి తప్పించారన్నారు. అతని హయాంలో జరిగిన సహకార సంఘం వ్యవహారాలను లోతుగా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు జవహర్ తెలిపారు.



నల్లూరు సహకార సంఘంలో మాట్లాడుతున్న జవహర్

ఉపాధి ఆడిట్‌లో రూ.1.16 లక్షల రికవరీకి ఆదేశం

పి.గన్నవరం: గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద మండలంలో నిర్వహించిన పనులకు గాను రూ.1.16 లక్షలు తేడా ఉన్నట్టు గుర్తించి, ఆ సొమ్మును సంబంధిత వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని డ్వామా పీడీ మధుసూదనరావు ఆదేశించారు. మండలంలో 2023–24 సంవత్సరానికి గాను మొత్తం రూ.8,31,13,642ల మేర ఖర్చు చేశారు. ఇందులో రూ.8,16,60,139లను కూలీలకు వేతనాలుగా, రూ.14,53,503లు మెటీరియల్‌కు చెల్లించారు. ఈ పనులపై గ్రామాల్లో ఇటీవల సామాజిక తనిఖీ చేశారు. అయితే ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.85,000, పంచాయతీ రాజ్‌కు సంబంధించి రూ.31,000 తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సొమ్మును రికవరీ చేయాలని పీడీ మధుసూదనరావు ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా ప్రజలకు మేలు చేసే విధంగా ఉపాధి పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భీమేశ్వర్, అంబుడ్స్‌మన్ మల్లికార్జున్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీఓ సీహెచ్ లక్ష్మీ నారాయణ, సీఆర్పీ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన

పి.గన్నవరం: మండలంలోని ఎల్.గన్నవరంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి స్థానిక జనసేన పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు రాజకీయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఉపాధి పనుల సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తుండగా, ఆ ప్రాంతానికి సుమారు 100 మంది కూలీలు వచ్చి ఆందోళన నిర్వహించారు. ఉపాధి కూలీలకు అన్యాయం జరిగే విధంగా తమ గ్రామ ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. తమ గ్రామంలో ఉపాధి పనుల్లో రాజకీయాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ, సర్పంచ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ వెనుదిరిగారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు యన్నాబత్తుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.